మొక్కవోని దీక్ష

- మియావాకీతో పర్యావరణ పరిరక్షణ
- విస్తీర్ణం: 3 ఎకరాలు
- నాటిన మొక్కలు : 14,500
- 54 రకాలు నాటిన ఉక్కు ఆగ్రో ఫారెస్ట్ విభాగం
- కాలుష్య నియంత్రణ వీటి ప్రత్యేకం
- అధికంగా ఆక్సిజన్ ఇవ్వడంతో ఆరోగ్య వనంగా గుర్తింపు

ప్రకృతి ఒడిలో పుట్టి ప్రకృతిలోనే కలిసిపోవాల్సిన మానవజాతి.. శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధి పేరుతో పర్యావరణాన్ని నిర్లక్ష్యం చేస్తోంది. పారిశ్రామిక రంగాన్ని పరుగులు పెట్టిస్తున్నామనే భ్రమల్లో... ప్రగతి పథాన నడుస్తున్నామనుకొని ప్రకృతిని వికృతంగా మార్చుకుంటూ పోతుంది. భూగోళం ఉష్ణ తాపానికి బలయ్యే పరిస్థితి కల్పించడంతో నాలుగు మాసాల కొనసాగాల్సిన వేసవి ఆరు మాసాలు ఉంటోంది. జీవకోటి నానా అవస్థలు పడుతోంది. అలాంటి పరిస్థితికి చెక్ పెట్టి పర్యావరణాన్ని పరిరక్షించాలని సంకల్పించారు. మియావాకీతో కాలుష్య నియంత్రణతో పాటు అధికంగా ఆక్సిజన్ ఇచ్చే మొక్కలు నాటారు ఉక్కు ఆగ్రోఫారెస్ట్ విభాగం అధికారులు. ప్రస్తుతం అది ఆరోగ్యవనంగా విరాజిల్లుతోంది. - అగనంపూడి

కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్న నిర్వాసితకాలనీ, పరిసర ప్రాంతీయులకు స్వచ్ఛమైన ఆక్సిజన్ అందివ్వాలనే సంకల్పం... సహజ సిద్ధమైన వాతావరణం కల్పించడమే లక్ష్యం... వాయు కాలుష్య రహిత, శబ్ద కాలుష్య రహిత పరిస్థితులను నెలకొల్పడానికి విశాఖ ఉక్కు యాజమాన్యం జపాన్ దేశానికి చెందిన మేలుజాతి మొక్కలను అగనంపూడి జాతీయ రహదారిని ఆనుకొని విశాలమైన ప్రాంగణంలో నాటింది.

జాతీయ రహదారిని ఆనుకొని అగనంపూడి సెక్టార్–1కి ఎదురుగా రెండున్నరేళ్ల కిందట మూడెకరాల విస్తీర్ణంలో 54 జాతులకు చెందిన 14500 మొక్కలు నాటారు. ఈ జాతి మొక్కలు చదరపు మీటరుకు మూడు నుంచి ఆరు వరకు నాటే అవకాశం ఉండడంతో చదరపు మీటరుకు మూడు వంతున నాటారు. ఎక్కువ సాంద్రతతో పాటు అధిక ఫలసాయం అందించే మొక్కలను ప్లాంటేషన్ చేయించారు. ఫోర్టియా, మహాగని, బౌహినియా, గిగర్, పీపాల్, పొంగామియా, టేకు, చింత, ఇండియన్ జుజుబే, జామ, సపోటా, దానిమ్మ, మామిడి, నిమ్మకాయ వంటి ఫలాలు అందించే మొక్కలతోపాటు అధిక దిగుబడినిచ్చే వాణిజ్య మొక్కలు కూడా నాటారు.


ప్లాంటేషన్ చేస్తున్న ఉక్కు ఆగ్రో ఫారెస్ట్ ఉన్నతాధికారులు (ఫైల్)


ఏపుగా పెరుగుతున్న వివిధ జాతుల మొక్కలు

ఎన్నెన్నో ఉపయోగాలు...

- 30 రెట్ల సాంద్రత అధికం.
- మొక్కల పెరుగుదలలో 10 రెట్లు అధికంగా ఉంటుంది.
- 30 రెట్లు వాయు, కాలుష్యాన్ని నియంత్రిస్తుంది.
- మిగతా చెట్లతో పోల్చుకుంటే ఈ జాతి మొక్కలు 30 రెట్లు అధికంగా కార్బన్ డైయాక్సైడ్‌ను పీల్చుకొని, అదే రీతిలో ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయి.
- మూడేళ్ల తర్వాత నిర్వహణ భారం ఉండదు.

ఆర్గానిక్ పద్ధతిలో ..

వందశాతం ఆర్గానిక్ పద్ధతిలో.. సహజసిద్ధమైన వాతావరణంలో వీటిని పెంచుతున్నారు. జీవ వైవిధ్యం సాధించాలనే సంకల్పంతో వీటిని ఏర్పాటు చేశారు. పరిశ్రమల కాలుష్యం చుట్టుముడుతున్న తరుణంలో అగనంపూడి నిర్వాసితకాలనీలకు భవిష్యత్‌లో ఈ అటవీ ప్రాంతం కొంత ఊరటనిస్తుందని నిర్వాసితులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పర్యావరణ సమతుల్యత



ఉక్కు యాజమాన్యం నిర్వాసిత కాలనీల అభివృద్ధిని పక్కన పెట్టినా, ప్లాంటేషన్ చేసి భవిష్యత్‌లో స్వచ్ఛమైన గాలిని పీల్చుకొనే అవకాశం కల్పించింది. ఉక్కు ఉద్యోగులు, నిర్వాసితులకు పంగనామాలు పెడుతున్న యాజమాన్యం ఇలాంటి పనులు చేయడం సంతోషకరమైన విషయమే. ఉక్కు నిధులతో ఏర్పాటు చేసిన అటవీ ప్రాంతాన్ని సంరక్షించుకోవాలి. - నక్కా రమణబాబు, బీసీ కాలనీ

కాలుష్య రహిత మొక్కలు



మూడెకరాల విస్తీర్ణంలో వాయు, శబ్ద కాలుష్యాన్ని గ్రహించే శక్తి ఉన్న మొక్కలు నాటడం ఆనందదాయకం. ఇలాంటి మొక్కలను నిర్వాసితకాలనీల్లోని వీధుల్లో నాటాలి. గ్రీనరీ కోసం కేటాయించిన స్థలాలు, మైదాన ప్రాంతాల్లో కూడా ప్లాంటేషన్‌కు చర్యలు చేపట్టాలి. - మంత్రి గిరి ప్రసాద్, ఫార్మాసిటీ కాలనీ

క్లుప్తంగా

వెండి దీపాల బహూకరణ


వెండి దీపాలు అందజేస్తున్న దాతలు అజయ్‌కుమార్, సౌజన్య దంపతులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రీవారి మూల విరాట్ దగ్గర వెలిగే వెండి దీపాలను దాతలు దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులకు అందజేశారు. యూఎస్‌ఏకు చెందిన చింతా చంద్రమౌళి కుమారుడు చింతా అజయ్ కుమార్, సౌజన్య దంపతులు ఆదివారం రూ.2,30,000 విలువగల వెండి దీపాలను దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులకు అందజేశారు. వీరికి ట్రస్ట్ ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు.

గంగిరెడ్లకాలనీ పాఠశాల విద్యార్థికి అభినందన


సాత్విక

అగనంపూడి: ఇటీవల నిర్వహించిన రెసిడెన్షియల్ పాఠశాల ప్రవేశ పరీక్షల్లో లంకెలపాలెం శివారు గంగిరెడ్లకాలనీ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థి కడా సాత్విక మంచి ర్యాంక్ సాధించి తానాం గురుకుల పాఠశాలలో అడ్మిషన్ పొందింది. ఈ మేరకు పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బాలికను అభినందించారు. నిరుపేద కుటుంబానికి చెందిన సాత్విక రెసిడెన్షియల్ పాఠశాలలో సీటు దక్కించుకోవడం సంతోషంగా ఉందన్నారు.

నేడు సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రతిష్ట


పూజలు చేస్తున్న భక్తులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని పెద నడుపూరులోని నూకాంబిక అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సోమవారం సుబ్రహ్మణ్య స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు చేశారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు.

స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి


నిరసన వ్యక్తం చేస్తున్న సిటు నాయకులు

సింహాచలం: తొలగించిన స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిటు డిమాండ్ చేసింది. సింహాచలంలో ఆదివారం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న గోపాలపట్నం సిటు ప్రధాన కార్యదర్శి పి.అనసూయ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులను విధుల నుంచి తొలగించడం అన్యాయమని, వెంటనే విధుల్లోకి తీసుకో వాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమ్మె డిమాండ్ల పరిష్కారానికి సీఎం జోక్యం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిటు జోన్ అధ్యక్షుడు ఎం.ప్రసాద్, సింహాచలం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎం.రామనాయుడు, సభ్యులు వెంకటరావు, అప్పారావు, నర్సింహులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్


రౌడీషీటర్లకు సూచనలిస్తున్న ఫోర్త్ టౌన్ ఎస్‌ఐ చిన్నంనాయుడు

తాటిచెట్లపాలెం: ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు ఎస్‌ఐ చిన్నం నాయుడు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఎటువంటి గొడవలు, కొట్లాటల్లో తలదూర్చకూడదని, మంచిగా నడుచుకుని, కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవించాలన్నారు. హద్దు మీరితే ఉపేక్షించేది లేదని రౌడీషీటర్లను ఎస్‌ఐ హెచ్చరించారు.

రేపటి నుంచి శ్రీవారి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో కొలువైన శ్రీవారి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులు ఆదివారం తెలిపారు. మంగళవారం సాయంత్రం 6 గంటలకు అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు. 4న ఉదయం 9 గంటలకు గరుణ ప్రతిష్ఠ, 5.30 గంటలకు ధ్వజారోహణ, 7 గంటలకు గరుడ ప్రసాద వితరణ జరపనున్నట్లు తెలిపారు. 5న ఉదయం 9.30 గంటలకు శ్రీవారి పెద్దశేష వాహన సేవ, సాయంత్రం 8 గంటలకు శ్రీవారి గరుడ వాహన సేవ, 6న 9.30 గంటలకు సూర్యప్రభ వాహన సేవ, ఉదయం 11 గంటలకు శ్రీవారి ఉత్సవ మూర్తులకు అభిషేకం, సాయంత్రం 6 గంటలకు ముత్యాల పందిరి వాహన సేవ, సాయంత్రం 6.30 గంటలకు శ్రీవారి ద్వితీయ వార్షిక కల్యాణం, 8 గంటలకు అన్న ప్రసాద వితరణ ఉంటుంది. 7న ఉదయం 10 గంటలకు వసంతోత్సవం, శ్రీవారి స్నపన తిరుమంజనం, శ్రీవారికి చక్రస్నానం నిర్వహించనున్నట్లు తెలిపారు.

దైవచింతన అవసరం


వెంకటరావు, కనక భవాని దంపతులను సత్కరిస్తున్న ఆలయ కమిటీ

అగనంపూడి: ప్రతి ఒక్కరిలో దైవ చింతన అవసరమని అగనంపూడి కోదండరామ ఆలయ కమిటీ ప్రతినిధులు విందుల రాజు, ఎస్.అప్పలరాజు అన్నారు. ఆలయంలో నిత్య దీపదూపారాధనకు సహకరిస్తున్న వెంకటరావు, కనకభవాని దంపతులను ఆదివారం ఘనంగా సత్కరించారు. ఎనిమిదేళ్లుగా సహకారం అందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఎం.దేముడు, జె.వెంకటరమణ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే పేదల సంక్షేమం


మహిళలకు చీరలు అందజేస్తున్న దేవన్‌రెడ్డి, చింతలపూడి

కూర్మన్నపాలెం: పేదల వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేసింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రమేనని ఆ పార్టీ గాజువాక సమన్వయకర్త తిప్పలదేవన్‌రెడ్డి అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పథకాన్ని లబ్ధిదారుల ఇళ్లకే పంపించారన్నారు. 87వ వార్డు వడ్లపూడి ఎస్సీ కాలనీలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇల్లపురాము ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పేదలకు చీరల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పథకాలన్నీ రద్దుచేసి అట్టడుగు వర్గాల ప్రజలను నట్టేటముంచిందన్నారు. మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య మాట్లాడుతూ టీడీపీ నాయకులు అధికారంలోకి రాకముందు అనేక మాయమాటలు చెప్పారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలను పట్టించుకోవడం లేదని.. ఇచ్చిన హామీలన్నీ బుట్టదాఖలు చేశారని దుయ్యబట్టారు. అందుకే ఈ నెల4న వెన్నుపోటు దినం పేరిట నిరసన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తమ వ్యతిరేకతను చంద్రబాబుకు తెలియజెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రగడవేణుబాబు, బొడ్డగోవింద్, దుర్గపుదానప్పలు, నాగేశ్వరరావు, ఆనంద్, విజయకుమార్ పాల్గొన్నారు.

కార్మిక పక్షపాతి మస్తానప్ప

రాజ్యసభ సభ్యుడు గొల్లబాబూరావు


మస్తానప్ప చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాజ్యసభ సభ్యుడు బాబూరావు, నాయకులు

ఉక్కునగరం: కార్మికులకు అండగా పోరాటాలు చేయడంతో పాటు వైఎస్సార్‌సీపీ బలోపేతానికి మస్తానప్ప చేసిన కృషి ఎనలేనిదని రాజ్యసభ సభ్యుడు గొల్లబాబూరావు అన్నారు. స్టీల్ వైఎస్సార్‌టీయూసీ వ్యవస్థాపక ప్రధానకార్యదర్శి వై. మస్తానప్ప 61వ జయంతి సందర్భంగా వై.మస్తానప్ప మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉక్కునగరం క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ గొల్ల బాబూరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజు, గాజువాక ఇన్‌చార్జి తిప్పల దేవన్‌రెడ్డి, రాజమండ్రి పార్లమెంట్ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి పాల్గొని మస్తానప్ప చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ కార్మిక సంఘం అభివృద్ధికి మస్తానప్ప చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 40 యూనిట్లు రక్తం సేకరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ వై. వరలక్ష్మి, వివిధ కార్మిక సంఘాల నాయకులు డి. ఆదినారాయణ, కె.ఎస్.ఎస్.రావు, రామ్మోహన్‌కుమార్, డి.వి. రమణారెడ్డి, పరదేశి, సంపూర్ణం, పిట్టారెడ్డి, నమ్మి సింహాద్రి, ఎ. అప్పారావు, పల్లా పెంటారావు, చంద్రశేఖర్ శకునాల, బి. సాయి, నవీన్‌కుమార్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానం.. వినోదం


యోగా సాధనలో చిన్నారులు


కథల పుస్తకాలు చదువుతూ..


క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థులు

పెదగంట్యాడ: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడుతున్నాయి. విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. మండలంలోని శాఖా గ్రంథాలయాంలో ఏప్రిల్ 28న ప్రారంభమైన శిబిరం ఈ నెల 6వ తేదీతో ముగియనుంది. రోజూ ఉదయం 8 నుంచి 11గంటల వరకూ నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు ఇంగ్లిష్, గణితం, క్రాఫ్ట్ కటింగ్, చదరంగం, క్యారమ్స్, డ్రాయింగ్, యోగా వంటి పలు అంశాల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు కథలు చెప్పడం, పుస్తక పఠనం ఇలా అనేక అంశాలను నేరిప్తున్నారు. శిక్షణ సందర్భంగా విద్యార్థులకు స్నాక్స్, మజ్జిగ, కూల్ డ్రింక్స్ గ్రంథాలయ అధికారి పీవీ రమణ అందజేస్తున్నారు.

కూటమిలో వణుకు పుట్టేలా 'వెన్నుపోటు దినం'


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ బాబూరావు, కె.కె.రాజు, ముఖ్యనాయకులు


కార్యక్రమంలో పాల్గొన్న వార్డుల అధ్యక్షులు, నాయకులు

గాజువాక: చంద్రబాబు ప్రభుత్వం వెన్నులో వణుకు పుట్టే విధంగా ఈనెల 4న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను విస్మరించడాన్ని నిరసిస్తూ ఈ నెల 4న నిర్వహించనున్న వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆదివారం పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజుతో కలిసి ఆయన గాజువాకలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏడాది పాలనలో ఏం చేశారో చెప్పుకోలేని దుస్థితి చంద్రబాబు ప్రభుత్వానిదని అన్నారు. హామీలను భూతద్దంలో చూపించి ప్రజలను మోసం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. సూపర్ సిక్స్ అంటూ ఊకదంపుడు ప్రచారంతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన తర్వాత మాటతప్పారని దుయ్యబట్టారు. స్టీల్‌ప్లాంట్‌ను తామే కాపాడుతామని చెప్పిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇప్పుడు కనీసం పట్టించుకోవడంలేదన్నారు. వారి మాటలు నమ్మి స్టీల్‌ప్లాంట్ కార్మికులు మోసపోయారన్నారు. స్టీల్‌ప్లాంట్ విషయంలో లోక్‌సభలో అడిగితే ప్రైవేట్‌పరం తప్పదని పంకజ్ మిశ్రా లిఖితపూర్వకంగా తెలిపారన్నారు. గత ఐదేళ్ల జనరంజక పాలన అందిస్తూ అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా జగన్ మోహన్‌రెడ్డి పని చేశారని గుర్తు చేశారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు అధికారమే ప్రధానంగా, నైతిక విలువలు లేకుండా చంద్రబాబు వాగ్దానాలతో ప్రజలను నమ్మించారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మోసం చేశారన్నారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి అధికారం లాక్కున్నట్టే ఓటర్లను కూడా వెన్నుపోటు పొడిచారన్నారు. పేదలకు ప్రభుత్వ విద్యను దూరం చేశారని, సంక్షేమ పథకాలు అందకుండా చేశారన్నారు. జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను చైతన్యపరచడంలో భాగంగానే వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలకు వైఎస్సార్‌సీపీ అండగా నిలబడి ప్రభుత్వ విధానాలను ఎండగడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఒంటిద్దుపోకడతో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరిణ చేస్తుందటే.. చంద్రబాబు కనీసం పట్టించుకోవడంలేదన్నారు. అమరావతి జపంతో ఉత్తరాంధ్రపై వివక్ష చూపిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, రాజమండ్రి పార్లమెంటరీ పరిశీలకుడు తిప్పల గురుమూర్తిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, కార్పొరేటర్లు ఉరుకూటి చందు, ఇమ్రాన్, భూపతిరాజు సుజాత, నాయకులు మార్టుపూడి పరదేశి, ఉరుకూటి అప్పారావు, పల్లా చినతల్లి, సిరట్ల శ్రీనివాస్, మద్ది శంకరరెడ్డి, ధర్మాల శ్రీను, గొందేశి మహేశ్వరరెడ్డి, కొయ్య భారతి, రోజారాణి, రాజాన వెంకటరావు, గుడివాడ లతీష్, బొడ్డ గోవింద్, చిత్రాడ వెంకట రమణ, మహాలక్ష్మి నాయుడు, కోమటి శ్రీను, చొప్పా నాగరాజు, షౌకత్ అలీ, నక్క వెంకట రమణ, ధర్మాల వెంకట రమణ, భూపతిరాజు శ్రీనివాసరావు, డాక్టర్ కల్యాణ్, బోగాది సన్నీ, పూర్ణానంద శర్మ, శంకరనారాయణ, చిక్కా సత్యనారాయణ, రంబ నారాయణమూర్తి, మహ్మద్ గౌస్, జి.వి.రమణ, పల్లా పెంటారావు, జీలకర్ర నాగేంద్ర, శిరీష, శ్రీదేవి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

నష్టాలకు కార్మికులను బాధ్యులను చేస్తారా?

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ నష్టాలకు కార్మికులను బాధ్యులను చేయడం అన్యాయమని స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ ప్రధానకార్యదర్శి డి. ఆదినారాయణ అన్నారు. ఉక్కు యాజమాన్యం కంపెనీ పరిస్థితులను ముఖ్యమంత్రికివివరించిన అంశాల్లో వాస్తవం లేదన్నారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు దేశంలో ఎక్కడా లేని విధంగా రోజుకు ఎనిమిదిన్నర గంటలు పని చేస్తున్నారన్నారు. ప్లానింగ్ కమిషన్ నివేదిక మేరకు 3.2 మి. టన్నులకు 16,500 మంది పర్మినెంట్ ఉద్యోగులు అవసరమని చెప్పి నియామకాలు చేయడం జరిగిందన్నారు. విస్తరణలో 3 వేల మంది పర్మినెంట్ ఉద్యోగులు, 900 మంది అధికారులు, 4500 కాంట్రాక్ట్ కార్మికులను అదనంగా నియమించారన్నారు. అయితే యాజమాన్యం ఇప్పుడు ఉద్యోగులు ఎక్కువగా ఉండడం వల్లే నష్టాలు వస్తున్నాయని.. అందుకే కార్మికులను తొలగించాల్సి వస్తుందని చెప్పడం దుర్మార్గమన్నారు. 1800 మంది కార్మికులు పని చేయకుండా జీతాలు తీసుకుంటున్నారని, 300 మంది యు పాసులతో నాయకులుగా తిరుగుతున్నారని సీఎంకు చెప్పడం అవాస్తవమన్నారు. ఉక్కు కర్మాగారాన్ని లాభాల్లో తీసుకురావడానికి సాంకేతిక నిపుణులతో కమిటీ నియమించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

ఉక్కు దీక్షలో భెల్ నాయకులు


రిలే నిరాహార దీక్షలో భెల్ ఇంటక్ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీ కరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలో ఆదివారం భెల్ ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు. ఇంటక్ జిల్లా ప్రధానకార్యదర్శి కె.ఈశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం..కూటమి నాయకులు మేము మాత్రమే విశాఖ ఉక్కును కాపాడగలమని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చారన్నారు. తర్వాత ఉక్కు పరిశ్రమను వేగవంతంగా ప్రైవేటీకరణ దిశగా పావులు కదుపుతున్నారన్నారు. దీనిలో భాగంగా విశాఖ ఉక్కులో శాశ్వత ఉద్యోగులను సుమారు 1500 మందిని వీఆర్‌ఎస్ పేరుమీద తొలగించడం, కాంట్రాక్ట్ కార్మికులను 3000 మందిని తొలగించడం, శాశ్వత ఉద్యోగులకు, కాంట్రాక్ట్ కార్మికులకు సుమారు 6 నెలల నుంచి సగం జీతాలు చెల్లించడం దురదృష్టకరం అన్నారు. విశాఖ ఉక్కు అభివృద్ధి చెందడం అంటే కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడం అని అర్థం అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉద్యోగులకు భద్రత కరువైందన్నారు. ఇప్పటికైనా కూటమి నాయకులు ప్రధాని మోదీతో మాట్లాడి ఒప్పించి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి పరిశ్రమకు సొంత గనులను కేటాయించాలని లేదా సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భెల్ ఇంటక్ యూనియన్ నాయకులు వారాడ ఆనందరావు, సీతన్‌నాయుడు, సీహెచ్.మురళీశ్వరరావు, ఇంటక్ జిల్లా ప్రధానకార్యదర్శి బోగవిల్లి నాగభూషణం పాల్గొన్నారు.

మొరాయించిన సర్వర్


అక్కిరెడ్డిపాలెంలో వృద్ధురాలి తంబ్ వేయడానికి అవస్థలు

గాజువాక/అక్కిరెడ్డిపాలెం: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కి ప్రజలను నానా ఇబ్బందులకు గురి చేస్తుంది. విద్య, వైద్య రంగాలను నిర్వీర్యం చేసింది. పేదలకు వైద్యం అందని ద్రాక్షగా మార్చింది. ప్రభుత్వ పాఠశాలలను విస్మరించి కార్పొరేట్ విద్యాలయాలకు పెద్దపీట వేసింది. కోతల్లో భాగంగా తాజాగా ఇంటి వద్దకే నిత్యావసర సరకుల పంపిణీని ఆదివారం నుంచి రద్దు చేసింది. ఇక రేషన్ పంపిణీకి తొలిరోజు చుక్కలు కనిపించాయి. సర్వర్ మొరాయించడంతో దిక్కులు చూడడం డీలర్ల వంతయింది. సర్వర్ సామర్థ్యాన్ని ముందుగా పరిశీలించకపోవడంతో ఆదివారం పంపిణీ సరిగా జరగలేదు. వెయ్యి మంది కార్డుదారులున్న డిపో నంబర్ 130లో కేవలం 40 మందికి సరకులు అందించారు. గాజువాకలో 146 రేషన్ డిపోలుండగా దాదాపు 1.40 లక్షల రేషన్ కార్డులున్నాయి. లబ్ధిదారులు తొలిరోజు మందకొడిగానే రేషన్ దుకాణాలకు వచ్చారు. మధ్యాహ్నం నుంచి సరకుల పంపిణీ ప్రారంభమైనప్పటికీ సర్వర్ మొరాయించడంతో పంపిణీ నత్తనడక నడిచింది. వేలి ముద్రలు పడక, క్యూలో నిరీక్షించలేక తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు.


రేషన్ కోసం క్యూలో..